సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



రైతు పోరుబాట సభలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గరిష్టం/కనిష్టం
32.1/22.1

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వేకువ జామున మంచు కురుస్తుంది. ఒకటి రెండు చోట్ల జల్లులు కురుస్తాయి.



కార్యకర్తలు, రైతులకు అభివాదం చేస్తున్న కేటీఆర్

బీఆర్‌ఎస్ రైతు పోరుబాట సభకు హాజరైన కార్యకర్తలు, రైతులు

పత్తికి గుజరాత్ ధరనే ఇవ్వాలి

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆదిలాబాద్‌లో 'రైతు పోరుబాట' సభ
- తరలివచ్చిన ఉమ్మడి జిల్లా రైతులు, నేతలు
- సభ సక్సెస్‌తో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం



కేటీఆర్‌కు నాగలి బహూకరిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, రైతులు, కార్యకర్తలు

ఆదిలాబాద్‌టౌన్: 'గుజరాత్‌లో పత్తికి క్వింటాల్‌కు రూ.8,800 ఇస్తున్నారు.. అక్కడ ఇస్తున్న ధరనే ఆదిలాబాద్ రైతులకు ఇవ్వాలి. ఈ బాధ్యతను బీజేపీ నాయకులే తీసుకోవాలి' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. గుజరాత్‌కు ఒక నీతి.. ఆదిలాబాద్‌కు ఒక నీతి ఎందుకని కేంద్రాన్ని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తెలంగాణ పత్తి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించేలా చూడాలన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం బీఆర్‌ఎస్ తలపెట్టిన రైతు పోరుబాట సభను ఆదిలాబాద్ రాంలీలా మైదానంలో గురువారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభకు ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు తరలివచ్చారు. సభలో కేటీఆర్ ప్రసంగం కార్యకర్తల్లో జోష్ పెంచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. సభ సక్సెస్ కావడంతో పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపించింది.

కుమురం భీం స్ఫూర్తితో..

ఉద్యమాల పురిటిగడ్డ కుమురం భీం స్ఫూర్తితో ఆదిలాబాద్ జిల్లా నుంచే రైతు పోరుబాట ప్రారంభించామన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రతీ మహిళకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2,500 చెల్లిస్తామని, వృద్ధులకు రెట్టింపు పింఛన్ ఇస్తామని, రైతు రుణమాఫీ, రైతు భరోసాను ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు నాయుడితో పాటు మహా వ్యక్తులనే ఎదుర్కొన్న తమ పార్టీకి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చిట్టి నాయుడు ఒక లెక్కనా.. అంటూ ఎద్దేవా చేశారు. వరికి బోనస్ అని చెప్పి బోగస్ మాటలు పలికారన్నారు. రైతులు, ప్రజల కోసం ప్రశ్నిస్తున్న తమపై కేసులు పెడుతున్నారని, ప్రజల కోసం రోజులు కాదు.. ఏడాది పాటైనా జైలుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అధికారులు, పోలీసులు న్యాయంగా పనిచేయాలని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. మితిమీరి ప్రవర్తిస్తే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మిత్తితో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. ముత్రా గ్రామస్తులు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై రాహుల్ గాంధీకి పోస్టుకార్డు పంపి ప్రశ్నించారని గుర్తు చేశారు. గ్రామ గ్రామాన ఉద్యమాలు చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భారత రాష్ట్ర సమితి భారత రైతు సమితిగా పోరాటాలు చేస్తుందని, రైతులు అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. కాంగ్రెస్, బీజేపీలు దొందూదొందేనన్నారు. సీసీఐ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేల మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్, డిక్లరేషన్ ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి భరోసా లేకపోగా ఆయన కుర్చీకి కూడా భరోసా లేదని ధ్వజమెత్తారు.

రెండు గంటలు ఆలస్యంగా..

ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ రెండు గంటల ఆలస్యమైంది. అయినప్పటికీ రైతులు, జనాలు ఓపికగా సభ ప్రాంగణంలో కేటీఆర్ రాక కోసం వేచిచూశారు. సభ ప్రాంగణానికి చేరుకున్న కేటీఆర్‌కు మాజీమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న స్వాగతం పలికారు. రైతు నాగలిని కేటీఆర్‌కు బహూకరించి సత్కరించారు. కేటీఆర్‌ను కలిసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు పోటాపోటీగా ఉత్సాహం చూపాయి. ఈ బహిరంగ సభలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కె.సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, జెడ్పీ మాజీ చైర్మన్‌లు రాథోడ్ జనార్దన్, లోలం శ్యామ్ సుందర్, ఆ పార్టీ నాయకులు మనోహర్, యూనుస్ అక్బాని, సాజిద్, అజయ్, పవన్ నాయక్, దాసరి రమేశ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, యాసం నర్సింగ్‌రావు, లింగారెడ్డి, సతీష్ పవార్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల చట్టబద్ధత ఏమైంది



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఆరు గ్యారెంటీలకు సంబంధించి రాజ్యాంగంపై చేసిన ప్రమాణం ఏమైందని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ప్రశ్నించారు. తమ ప్రభుత్వం బాసర ట్రిపుల్ ఐటీకి ఇచ్చిన రూ.42 కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నారన్నారు. ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటించి బుట్టదాఖలు చేశారన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రేవంత్‌రెడ్డి సీఎం రాష్ట్రానికా.. ఢిల్లీకా



రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి తెలంగాణకా లేక ఢిల్లీకా అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఎద్దేవా చేశారు. ప్రతీ విషయానికి ఢిల్లీ వెళ్తున్నారని, ఇక్కడి ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రతీ జూన్, అక్టోబర్‌లో రైతు బంధు డబ్బులు పడేవని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా లేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారన్నారు.

ఆస్పత్రుల్లో మందుల్లేవ్..



ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు ఇచ్చేందుకు కనీసం మందులు లేవని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. రైతు ఆత్మహత్యల నివారణ కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు బంధు, రైతుబీమా అమలుచేశారన్నారు. ప్రస్తుతం రుణమాఫీ డబ్బులు జమ కాక అన్నదాతలు అవస్థలు పడుతున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో కరెంటు కోతలు లేవని, ప్రస్తుతం గంటల తరబడి కోతలు విధిస్తున్నారని అన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి సివిల్ సర్వీసెస్ అధికారుల పర్యటన

కైలాస్‌నగర్: శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ అధికారులు ఈ నెల 25 నుంచి 28 వరకు ఆదిలాబాద్ పట్టణంలో పర్యటించనున్నారని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బల్దియా అధికారులు, ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 21 మంది సివిల్ సర్వీసెస్ అధికారులు శుక్రవారం నుంచి పట్టణంలో పర్యటించనున్నట్లు తెలి పారు. 21 మంది నాలుగు బృందాలుగా విడిపోయి తిర్పెల్లి, రాంనగర్, సుభాష్‌నగర్, శాంతినగర్ కాలనీల్లో పర్యటిస్తారన్నారు. వారి పర్యటన జయప్రదం చేసేలా బల్దియా ప్రతీ అధికారి, ఉద్యోగి చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో డీఈ తిరుపతి, ఆర్‌వో జాదవ్ క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల జేఏసీ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీ జేఏసీ) నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా కొప్పుల దేవిదాస్, కో చైర్మన్‌గా రాథోడ్ సంజీవ్ నాయక్, కన్వీనర్‌గా దాలే రవికుమార్, కో కన్వీనర్‌గా ఎండీ సాధిక్, కోశాధికారిగా దొంతుల విక్రమ్, సెక్రెటరీలుగా మనోజ్ కుమార్, మహ్మద్‌మూసా, ఆర్గనైజేషన్ సెక్రెటరీలుగా రాథోడ్ చందు, కిషన్, మీడియా ఇన్‌చార్జీలుగా పూసేందర్, అప్పన్నను ఎన్నుకున్నారు.

'ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి'

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గాదిగూడ మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ మాట్లాడుతూ మండలంలోని పున్నగూడ, అల్లిగూడ, మారేగావ్, కొలమా బుద్ధుగూడ, కునికసా, చిన్నకుండి, పొనూర్ గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతబడి ఉన్నాయన్నారు. దీంతో విద్యార్థులు వ్యవసాయ కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గ్రామాల్లో విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు సిద్దిపేటకు బల్దియా కమిషనర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్ శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. సిద్దిపేట పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రతకోసం అక్కడి మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. స్వచ్ఛ సిద్దిపేట సాధనకు అక్కడి యంత్రాంగం అవలంబించిన విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు. అనంతరం ఆదిలాబాద్ పట్టణ పరిశుభ్రత కోసం అక్కడి చర్యలను అవలంబించేలా తగు చర్యలు చేపట్టనున్నారు.

తేమశాతం సడలించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో గురువారం సోయా కొనుగోళ్లలో తేమశాతం 12కు పైబడి రావడంతో మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులు కొనుగోలుకు నిరాకరించారు. దీంతో బాధిత రైతులు తేమశాతం 14వరకు సడలించాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎస్సై రాధిక సంఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డితో మాట్లాడించడంతో ఆందోళన విరమించారు. దీంతో సబ్‌యార్డులో సోయాలకు తేమశాతం 12.5 వరకు వచ్చినా అధికారులు కొనుగోలు చేశారు.

బీసీ కమిషన్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాజర్షి షా



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఈ నెల 28న బీసీ కమిషన్ జిల్లా కేంద్రంలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. వారి రాక నేపథ్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చేపట్టిన ఏర్పాట్లను గురువారం అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాలకు సంబంధించిన రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు హాజరవుతున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, ఆర్డీవో వినోద్ కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీబీసీడబ్ల్యూఓ కె.రాజలింగు, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఎంహెచ్‌వో కృష్ణ, డీఎల్‌పీవో ఫణీందర్ రావు, తదితరులు ఉన్నారు.

బల్దియా దుకాణాలకు వేలం

- ఈ నెల 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 2న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం



పాత మున్సిపల్ కార్యాలయంలోని మడిగెలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి ఏళ్లుగా ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు బల్దియా అధికారులు ఎట్టకేలకు దృష్టి సారించారు. దుకాణాలు ఖాళీగా ఉండటంతో బల్దియా ఆదాయానికి గండి కొడుతున్న వైనాన్ని వివరిస్తూ 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన బల్దియా అధికారులు ఆలస్యంగానైన వాటికి వేలం నిర్వహించేందుకు కసరత్తు చేపట్టారు. మున్సిపల్ పాత కార్యాలయానికి సంబంధించి 13 షాపులు, శివాజీచౌక్‌లో రెండు, ఓల్డ్ బస్టాండ్‌లో 2 షాపులు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన పట్టణ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రతీ దుకాణానికి ఒక్కో దరఖాస్తును వేర్వేరుగా తీసుకుంటున్నారు. దరఖాస్తు ఫీజు రూ.2వేలు, ఈఎండీ సొమ్ముగా రూ.50వేల నగదును దరఖాస్తుతో పాటే స్వీకరిస్తున్నారు. వేలం ప్రక్రియను ప్రభుత్వం నిర్ణయించిన రూ.50వేల నుంచి ప్రారంభించనున్నారు. ఎవరైతే ఎక్కువ పాట పడుతారో వారికి షాపులను కేటాయించనున్నారు. ఒక్కో దుకాణానికి నెలవారీ అద్దె రూ.15వేలుగా నిర్ణయించారు. దరఖాస్తుతో పాటు చెల్లించిన ఈఎండీ సొమ్ము షాపులు దక్కని వారికి తిరిగి చెల్లించబడదని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 30వరకు దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఏయే షాపులు ఏ రోస్టర్ వారికి కేటాయించామనే వివరాలను మున్సిపల్ కార్యాలయ నోటీసుబోర్డుపై ఉంచినట్లుగా తెలిపారు. ఈ షాపుల కేటాయింపు కోసం నవంబర్ 2న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

దూది రైతు దుఃఖం తీరేనా?

- నేటి నుంచి ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు
- మద్దతు ధర కష్టమే అంటున్న వ్యాపారులు
- బహిరంగ మార్కెట్లో ధర పడిపోయిందని వ్యాఖ్య
- రంగంలోకి దిగిన సీసీఐ..
- మద్దతు ధర రూ.7,521
- 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోళ్లు

జిల్లా వివరాలు
పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521
గతేడాది జిల్లాలో దిగుబడి 20 లక్షల క్వింటాళ్లు
ఈఏడాది దిగుబడి అంచనా 32.48 లక్షల క్వింటాళ్లు
బహిరంగ మార్కెట్ ధర రూ.7వేలు
జిల్లాలో ఈఏడాది పత్తి సాగు విస్తీర్ణం 4లక్షల 33వేల ఎకరాలు
గతేడాది ఆదిలాబాద్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన పత్తి 11లక్షల 58వేల క్వింటాళ్లు



ఆదిలాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం



కొనుగోళ్లకు ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన అన్నదాతలకు కన్నీళ్లే ఎదురవుతున్నాయి. ఏటా ఏదో రూపంలో అన్నదాత నష్టపోతూనే ఉన్నాడు.. అతివృష్టి, అనావృష్టి, పంటలు బాగా పండితే మద్దతు ధర దక్కకపోవడం, దిగుబడులు లేని సమయంలో ధరలు పెరగడం.. ఇలా అనేక సమస్యలతో సతమతం అవుతున్నాడు. కనీసం పెట్టుబడి రాని పరిస్థితుల్లో రైతు కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్లో పత్తికి ధర తక్కువగా ఉందని ప్రైవేట్ వ్యాపారులు చెబుతున్నారు. మద్దతు ధర కంటే తక్కువ ధర ఉండడంతో సీసీఐ రంగంలోకి దిగనుంది. అయితే ఈసారి మద్దతు ధర లభించడం గగనమే అన్నట్లు కనిపిస్తోంది. చలికాలం ప్రారంభం కావడంతో పత్తిలో కనీసం 15 శాతం వరకు తేమ ఉండే పరిస్థితి ఉంది. కానీ 8 నుంచి 12 శాతం తేమ మించితే కొనుగోలు చేయమని సీసీఐ అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా శుక్రవారం ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే, ఎంపీ పత్తి కొనుగోళ్లు ప్రారంభించనున్నారు.

మద్దతు ధర లభించేనా?

పత్తికి ఈసారైనా మద్దతు ధర లభిస్తుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. యేటా తేమ కొర్రీతో నష్టపోతూనే ఉన్నారు. అయితే ఈఏడాది మాత్రం అంతర్జాతీయ మార్కెట్లో పత్తి ధర తక్కువగా ఉండడంతో సీసీఐ ద్వారానే కొనుగోళ్లు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీసీఐ రంగంలో ఉంటే 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తుంది. అంతకు మించితే కొనుగోలుకు నిరాకరిస్తారు. దీని ప్రభావం రైతులపై పడనుంది. పత్తిలో 15 నుంచి 20 శాతం వరకు తేమ ఉండే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. తేమ విషయంలో మార్కెట్ యార్డులో అన్నదాతలు ఆందోళనకు దిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 8 శాతం తేమ ఉంటే మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ధర లభించనుంది. 9 శాతం ఉంటే రూ.7,445, 10 శాతం ఉంటే రూ.7,370, 11 శాతం ఉంటే రూ.7,295, 12 శాతం ఉంటే రూ.7,220 ధర లభించనుంది.

అధిక వర్షాలతో పంటలకు నష్టం..

ఈ ఏడాది ఆగస్టులో కురిసిన అధిక వర్షాలకు పత్తి పంట దెబ్బతింది. పూత, కాత దశలో వర్షాలు కురిశాయి. దీంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. సాధారణంగా ఎకరానికి 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం 7 నుంచి 8 క్వింటాళ్ల మాత్రమే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో 4లక్షల 33వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. దాదాపు 32 లక్షల 47వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారుల అంచనా. గతేడాది జిల్లాలో 20 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మొత్తం 11లక్షల 58వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఇందులో 7లక్షల 58వేల క్వింటాళ్లు సీసీఐ, 3లక్షల 46వేల క్వింటాళ్లు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. గతేడాది పత్తి మద్దతు ధర రూ.7,020 ఉండగా, మొదటి రోజు ప్రైవేట్ వ్యాపారులు అత్యధికంగా రూ.7100తో కొనుగోలు చేశారు. ఆ తర్వాత ధర తగ్గింది. రైతుకు రూ.6,800 నుంచి రూ.6,500 వరకు ధర లభించింది.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో శుక్రవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నాం. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 11 కాంటాలను ఏర్పాటు చేశాం. సీసీఐతో పాటు ప్రైవేట్ వ్యాపారులు రంగంలో ఉండనున్నారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే పరిష్కరించేందుకు మల్టీ కంట్రోల్ కమిటీని ఏర్పాటు చేశాం.

– మధుకర్, మార్కెట్ కార్యదర్శి, ఆదిలాబాద్

క్లుప్తంగా

పాప కోసం ఆర్థిక సాయం



పాఠశాల యాజమాన్యానికి చెక్కును అందజేస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ టీం సభ్యులు

మంచిర్యాలఅర్బన్: అభ్యాస స్కూల్ నాలుగో తరగతి విద్యార్థిని జాగృతి వైద్య చికిత్స కోసం ఆదిత్య ఎన్‌క్లేవ్‌కు చెందిన షటిల్ బ్యాడ్మింటన్ టీం సభ్యులు ఆపన్నహస్తం అందించారు. ఈ నెల 20న 'ఈ పాపను కాపాడరూ..' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి చలించిపోయారు. స్థానిక చిరుద్యోగి గడేవార్ గజానన్, రూప దంపతుల కూతురు జాగృతి ఎక్యూట్ లింపోసైటిక్ ల్యూకేమియాతో బాధప డుతుండడంతో టీం సభ్యులు ఆలోచన చేశారు. గురువారం అనుకున్నదే తడువుగా పాప కుటుంబసభ్యులు అందుబాటులో లేక పోవడంతో రూ.30వేల చెక్కును పాఠశాల కర స్పాండెంట్ సుధాతికి అందజేశారు.

అలీనగర్ సెక్షన్ అధికారి సస్పెన్షన్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ అలీనగర్ సెక్షన్ అధికారి కిరణ్మయిని సస్పెండ్ చేస్తూ ఎఫ్‌డీపీటీ శాంతారాం గురు వారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్ల క్ష్యం వహించడంతోపాటు ఇటీవల అలీనగర్ గ్రామంలో ఫర్నిచర్ పట్టుబడిన ఘటనపై సస్పెండ్ చేసినట్లు తాళ్లపేట్ రేంజ్ అధికారి సుష్మారావు పేర్కొన్నారు. కోర్ ఏరియా పరిధిలో రోజులుగా ఫర్నిచర్ పని జరిగినా నిర్ల క్ష్యం వహించడం కారణమని తెలిపారు.

ఏడుగురు బైండోవర్

జన్నారం: గ్రామాల్లో గుడుంబా తయారీదారు లు, నాటుసారా విక్రయించిన ఏడుగురిని తహ సీల్దార్ రాజమనోహర్‌రెడ్డి గురువారం ఎదుట బైండోవర్ చేసినట్లు లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ నర్సింహులు తెలిపారు. మండలంలోని కిష్టా పూర్‌కు చెందిన పుట్టకొక్కుల నరేశ్, చింతగూ డకు చెందిన బానవత్ లక్ష్మి, మహ్మదాబాద్‌కు చెందిన కామెర మల్లు, కలమడుగుకు చెందిన లావుడ్యా సంతోశ్, మందపెల్లికి చెందిన డోం గరి విజయలక్ష్మి, తిమ్మాపూర్‌కు చెందిన గందం లక్ష్మి, చింతలపల్లికి చెందిన గొల్లె అమృతను తహసీల్దార్ ఎదుట హాజరుపర్చామని పేర్కొ న్నారు. మరోసారి నాటుసారా అమ్మిన, గుడుం బా తయారీ చేసిన రూ.లక్ష జరిమానా విధిస్తా మని హెచ్చరించారు. వీరి వెంట ఎక్సైజ్ సిబ్బం ది ఉన్నారు.

కలప పట్టివేత



పట్టుబడ్డ కలప దుంగలతో అటవీ అధికారులు

సారంగపూర్: మండలంలోని పొట్య గ్రామా నికి చెందిన గంగాధర్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.30 వేలు విలువ చేసే కలప దుంగ లను గురువారం అటవీ అధికారులు పట్టుకు న్నారు. పక్కా సమాచారంతో అటవీ సెక్షన్ అధికారి నజీర్‌ఖాన్ సిబ్బందితో కలిసి గం గాధర్ ఇంటిని తనిఖీ చేశారు. కలప దుంగలు, సైజులను గుర్తించడంతోపాటు అక్కడే కోత యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమే రకు కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో ఎఫ్‌బీఓలు సుజాత వెన్నెల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్' పూర్తయ్యేనా?

- రామకృష్ణాపూర్‌లో నత్తనడకన మార్కెట్ నిర్మాణం
- పిల్లర్ల దశలో నిలిచిన పనులు
- పూర్తిస్థాయిలో నిధులు లేకనే..



పిల్లర్ల దశలో ఆర్‌కేపీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు

రామకృష్ణాపూర్: కూరగాయలు, చేపలు, మటన్, చికెన్ అన్నీ ఒకేచోట సమకూర్చాలని గత ప్రభు త్వం రామకృష్ణాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవ న నిర్మాణ పనులు ప్రారంభించింది. 2021లో రూ. 9.5 కోట్ల వ్యయంతో భవన నిర్మాణ పనులను అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. పనులు నత్తనడకన సాగడం, నిధుల లేమితో అర్ధంతరంగా నిలిచిపోయింది. పిల్లర్ల దశలోనే పనులు నిలిచి అ లంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఇదేమిట ని ఆరా తీస్తే నిధుల విడుదల తాత్సారమే ప్రధాన కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే పెద్ద మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న క్యాతనపల్లి.. మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన సంగతి తెలిసిందే. దీంతో ప్రజల అవసరాల నిమిత్తం అప్పటి ప్ర భుత్వం సమీకృత వ్యవసాయ మార్కెట్ సముదా యాన్ని నిర్మించాలని సంకల్పించి పనులు ప్రారంభించింది. రెండు అంత స్తుల భవనం చిరు వ్యాపారులకు అందుబాటులో ఉంటుందని మురిసేలోపే గత అసెంబ్లీ గడువు తీరి ఎన్నికలు రావడం.. బీఆర్‌ఎస్ ఓటమి పాలు కావ టంతో ఇప్పుడు సమీకృత భవన నిర్మాణంపై సందే హాలు మొదలయ్యాయి.

పిల్లర్ల దశలో..

పట్టణంలోని అంగడిబజార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వారసంత సమీపంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపది కన పనులు చేపట్టడంతో ప్రజలు, సింగరేణి కార్మి కులు సంబురపడ్డారు. చివరికి ప్రభుత్వమే మారి పరిస్థితులు తలకిందులు అవడంతో మార్కె ట్ భ వనం కాస్త పిల్లర్ల దశలో దర్శనమిస్తోంది. పూర్తి స్థా యిలో నిధులు విడుదల చేయలేని పరిస్థితిఉంది.

చెన్నూర్ సెగ్మెంట్ మొత్తం ఇంతే..

రామకృష్ణాపూర్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఒక్కటనే కాదు చెన్నూర్ అసెంబ్లీ నియోజకవ ర్గం మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. నియోజక వర్గంలోని చెన్నూర్, మందమర్రి మున్సిపాలిటీ ల్లో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ భవనాల పరిస్థితి ఇలాగే ఉందని తెలుస్తోంది. చెన్నూర్‌లో దాదా పు పూర్తయినా మందమర్రి, క్యాతనపల్లిల్లో అసంపూర్తిగానే నిలిచిపోయాయి. ఏదేమైనా ఇప్పటికే 60–70 శాతం పనులు పూర్తయి, నిధుల లేమితో నిర్మాణాలు నిలిచిపోయాయని అధికా రులు చెబుతున్నారు. అసంపూర్తిగా ఉన్న మార్కెట్ నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేసి అం దుబాటులోకి తీసుకురావాలనికోరుతున్నారు.

దండారీ ఉత్సవాలు షురూ



వాల్గొండలో పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: గిరిజన గ్రామాల్లో దండారీ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలోని గౌరపూర్, వాల్గొండ గ్రామాల్లో ఆదివాసీలు బోగి పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా యేత్మసుర్ దేవతలకు పూజలు చేశారు. గ్రామాల్లో 7 నుంచి 9 రోజులపాటు గుస్సాడీ, కోలాటం, సంప్రదాయ నృత్యాలు చేయనున్నారు. ఇతర గ్రామాల దండారీ బృందాలను అతిథులుగా ఆహ్వానించి, ఇతర గ్రామాలకు అతిథులుగా వెళ్లి మర్యాదలు తీసుకుంటామని గ్రామాల పెద్దలు తెలిపారు. దీపావళి తర్వాత కోలబోడి పూజలతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్య, వైద్యం అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో గురువారం గిరిజన పోషణ మిత్రపై సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన పోషణమిత్ర ద్వారా విద్యార్థులకు వంద శాతం స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. విద్యా ర్థినులకు రక్త పరీక్షలు నిర్వహి ంచాలని డీఎంహెచ్‌వోలను ఆదేశించారు. వారికి రక్తం తక్కువ ఉంటే ఐరన్ మాత్రలు అందించాలన్నారు. యూనిట్ అధికారులు 1,2 ఆశ్రమ పాఠశాలలను దత్తత తీసు కుని సందర్శించాలన్నారు. ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వోలు, ఏడీఎంహెచ్‌వో మనోహర్, డీటీడీవోలు రమాదేవి, గంగారాం, ఏటీడీవోలు, జీసీడీవోలు, వార్డెన్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం..

ఇంద్రవెల్లి మండలం ఏకలవ్య ఆదర్శ పాఠశాలకు చెందిన హర్షపావనిని జాతీయ స్థాయిలో అమేజాన్ ఫ్యూచర్ ఇంజినీరింగ్ ప్రోగ్రాం కోడర్స్ ఎక్స్‌పో న్యూఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని ద్వితీయ బహు మతి సాధించింది. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా గురువారం తన కార్యాలయంలో ఆమెను సన్మానిం చారు. ఆర్సీవో అనీల్, ప్రిన్సిపాల్ సౌరభ్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తడి పేల్చివేత కేసులో మరొకరి అరెస్ట్

- పరారీలో ఇంకొకరు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

చెన్నూర్: చెన్నూర్ శనిగకుంట మత్తడి పేల్చివేత కేసులో మరొకరిని అరెస్ట్ చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. మత్తడి పేల్చివేత కేసులో ఇప్పటికే 14 మందిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. తాజాగా, పేల్చివేతకు జిలిటెన్ స్టిక్స్ సరఫరా చేసిన మందమ ర్రి పట్టణానికి చెందిన మేదరి సతీశ్‌ను అరెస్టు చేశారు. జిలిటెన్స్ స్టిక్స్ డీలర్ నితీశ్ బిర్లా పరారీలో ఉన్నారు. సమావేశంలో సీఐ రవీందర్, ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

16కు చేరిన నిందితులు

గత నెల 16న శనిగకుంట మత్తడి పేల్చివేత ఘటన రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తొలుత నలుగురు ప్రధాన నిందితులు రిమాండ్‌కు తరలించారు. రెండోసారి మరో 8 మందిని అరెస్ట్ చేశారు. గత పక్షం రోజుల్లో మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. పేల్చివేత ఘటనకు సంబంధించి 16 మంది నిందితుల భాగస్వామ్యం ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

యువకుడిని మోసం చేసిన జంట అరెస్టు

మందమర్రిరూరల్: యువకుడిని మోసం చేసిన జంటను అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో సీఐ గురువారం ఈ మేరకు వివరాలు వెల్లడిం చారు. మందమర్రిలోని యాపల్ ప్రాంతానికి చెందిన యువకుడికి గత మార్చిలో గుర్తుతె లియని యువతి ఫోన్ చేసి పరిచయం పెంచు కుంది. కొన్నిరోజుల తర్వాత తన కుమారుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్నాడని డబ్బులు కావాలని అడగడంతో సదరు యువకుడు రూ.4,600 ఫోన్ పే చేశాడు. ఆ తర్వాత యువతి ఫొటోలు యువకుడి ఫోన్ నంబర్‌కు పంపించి మరింత దగ్గరైంది. ఈక్రమంలో తాను ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని అడిగితే యువకుడి ఫోన్ నంబర్‌ను బ్లాక్‌చేసింది. మరోసారి ఫోన్ చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని యువతి ప్రియుడు సదరు యువకు డికి ఫోన్ చేసి బెదిరించాడు. ఫిర్యాదు చేయ కుండా ఉండాలంటే డబ్బులు పంపాలనడం తో రూ.85 వేలు ఫోన్ పే చేశాడు. అయినా మళ్లీ బెదిరించడంతో సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. ఆరా తీసిన మందమర్రి పోలీసులు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పొన్నూర్‌కు చెందిన బొద్దిరెడ్డి మౌనిక, శనిగారపు మధుకర్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. ఈసమావేశంలో ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన బొల్లు సంజీవ్ అదృశ్యమైనట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రైవేట్ ఉద్యోగిగా పనిచే స్తున్న ఆయన బుధవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లారు. రాత్రి వరకు తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై వివరించారు.

మహిళను మోసగించిన కేసులో వ్యక్తికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్: మహిళను మోసగించిన కేసులో వ్యక్తికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధా న న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పు చెప్పారు. కాగజ్‌నగర్ సీఐ రాజేంద్రప్రసాద్ కథనం ప్రకారం..పట్టణంలోని మారుతినగర్ లో ఉంటున్న మహిళ ఇంట్లోకి నాగపురి అశోక్ అద్దెకు ఉంటున్నాడు. సదరు మ హిళను పెళ్లి చేసుకుంటానని చెప్పి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకోవాలని అడి గితే తిరస్కరించాడు. దీంతో బాధిత మహిళ 2019 డిసెంబర్ 21న కాగజ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ మేరకు కోర్టులో చార్జి షీటు దాఖలు అనం తరం పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించారు. నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు. నిం దితుడికి శిక్షపడేలా కృషి చేసిన పీపీ, కోర్టు లైజనింగ్ అధికారి రామ్‌సింగ్, కానిస్టేబుల్ బాబాజీ తదితరులను ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అభినందించారు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురు రిమాండ్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా నమోదైన మూడు కేసుల్లో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..సీసీసీ నస్పూర్ ఆర్కే 5 ప్రాంతానికి చెందిన తణుగుల నారాయణ, మందమ ర్రిలోని ప్రాణహిత కాలనీకి చెందిన తీగల శంక ర్, సీసీసీ నస్పూర్ గాంధీ నగర్‌కు చెందిన పులి తిరుపతిలు గత కొంత కాలంగా కోర్టు పేషీలకు హాజరుకావడం లేదు. దీంతో మొదటి అదనపు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజి స్ట్రేట్ ఉప నిషద్వని నాన్‌బెయిలబుల్ వారెంట్ చేశారు. పోలీసులు గాలింపు చేపట్టి ముగ్గురిని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుప ర్చినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా జోనల్‌స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి బాల,బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు బెల్లంపల్లిలో జరిగాయి. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాలలో పోటీలు నిర్వహిం చారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగం లో నిర్వహించిన ఈ పోటీలను కాళేశ్వరం జోన్ సం క్షేమ గురుకులాల జోనల్ అధికారి అరుణకుమారి ప్రారంభించారు. ఇందులో విద్యార్థులు ప్రతిభ కన బర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అర్హత సాధించిన జట్లను ఎస్జీఎఫ్ సెక్రెటరీ బి.బాబురావు గురువారం ప్రకటించారు.

ఎంపికైన బాలికల జట్టు..

ఎ.నందిని, ఆర్.శ్రీవల్లి (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ లక్సెట్టిపేట), కె.గంగ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ మందమ ర్రి), ఎ.సన్నిహిత (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ రెబ్బెన), జె.అశ్విత, జి.శిరీష, టి.అనూష (కేజీబీవీ రెబ్బెన), టి.వైష్ణవి, సీహెచ్.సింధు, కె.వేణుప్రియ (మోడల్ స్కూల్ మంచిర్యాల), ఎస్.శ్రీజ, ఎం.అంజలి, అక్షయ, శృతి (ప్రభుత్వ జూనియర్ కళాశాల బెల్లం పల్లి), ఎండీ.సన అంజుమ్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బెల్లంపల్లి) ఎంపికయ్యారు.

ఎంపికైన బాలుర జట్టు..

జి.అభిషేక్, ఎస్.వినయ్, పి.అభిషేక్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల కాసిపేట), డి.అంజన్న (మో డల్ స్కూల్ ఆసిఫాబాద్), ఎస్.వంశీకృష్ణ (టీఎస్‌డ బ్ల్యూఆర్‌ఎస్ ఆసిఫాబాద్), ఎ.కార్తీక్ (ఆల్ఫోర్స్ మంచిర్యాల), ఎ.వంశీ, ఇ.మల్లేశ్, ఎస్.క్రాంతి ఎ. ఆదర్శ్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ కాసిపేట), ఎస్.అశ్వత్, ఎం.రాము (మోడల్ స్కూల్ ఆసిఫాబాద్), జె.జయవర్ధన్ (సీఓఈ బెల్లంపల్లి), ఎండీ అసద్, శ్రీ మన్ (మోడల్ స్కూల్ మంచిర్యాల), జి.రాంచరణ్ తేజ (ప్రభుత్వ జూనియర్ కళాశాల బెల్లంపల్లి) ఎం పికయ్యారు. నవంబర్ 3 నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొంటారు.

బంగారం దుకాణంలో చోరీ

- 13 కిలోల వెండి, 3 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు



పరిశీలిస్తున్న సీఐ నైలు, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది

కుభీర్: మండల కేంద్రంలోని ఆకాశ్ జువెల్లరీ (బం గారం దుకాణం)లో గుర్తుతెలియని వ్యక్తులు బుధ వారం అర్ధరాత్రి 2.45 గంటలకు చోరీకి పాల్ప డ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. షాపు యజమాని డి.ఆకాశ్ పెళ్లి నిమిత్తం సామగ్రి కోసం కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం నిజామా బాద్ వెళ్లారు. తిరిగి రాత్రి 12 గంటలకు వచ్చారు. గురువారం ఉదయం కాకడహారతి కోసం విఠలే శ్వర మందిరం వెళ్దామని బయటకు వచ్చి చూడగా షాపు షెటర్ తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా 13 కిలోల వెండి, 3 తులాల బంగారం, రూ. 45 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారని షాపు యజమాని పోలీసులకు సమాచారం అందించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సిబ్బందితో సీఐ నైలు, ఎస్సై పి.రవీందర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్లు తీసుకున్నారు. షాపు బయట ఉన్న రెండు సీసీ కెమెరాలను దొంగలు ధ్వంసం చేసి, షెటర్ తాళం పగులగొట్టారు. ఒకరు లోపలికి వెళ్లి స్ప్రే చేసినట్లు యజమాని సెల్‌లో రికార్డు అయింది. మరో ఇద్దరు లూటీచేసినట్లు భావిస్తున్నారు. రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా, ముగ్గురు బైక్‌పై వెళ్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. కాగా, ఎస్పీ జానకీ షర్మిల ఆదే శాలతో క్లూస్‌టీంలు ఏర్పాటు చేసి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ నైలు తెలిపారు. షాపు యజమాని ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తు న్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దపులి ఎటు వెళ్లిందో..!

- కంటెగాం నుంచి వజ్జర్ వైపు మళ్లిందన్న సందేహాలు
- ఇంకా భయం..భయంగానే గ్రామాలు

బోథ్: పెద్దపులి గ్రామాలను భయపెడుతూనే ఉం ది. రెండు రోజులుగా చింతల్‌బోరి, చింతగూడ, నేరేడుపల్లె, రేండ్లపల్లిలో కనిపించి నేరేడుపల్లె సమీ పంలో ఓ ఆవును హతమార్చింది. బుధవారం రా త్రి నుంచి ఎటువెళ్లిందన్న సందేహాలు తలెత్తుతు న్నాయి. మళ్లీ తమ గ్రామాలవైపు వస్తుందేమోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతూ బిక్కుబిక్కుమంటూ ఇళ్లల్లోనే ఉంటున్నారు. అయి తే పులి ఎద్దును హతమార్చిన చోట ఫారెస్టు అధి కారులు ట్రాప్ కెమెరాలను అమర్చారు. ఆవు కళే బరాన్ని సైతం అక్కడే ఉంచారు. అయితే రాత్రి వేళ నేరేడుపల్లె నుంచి కంటెగాం వెనుక భాగంలో దట్ట మైన అడవిలోకి ప్రవేశించి ఉంటుందని భావి స్తు న్నారు. అక్కడి నుంచి వజ్జర్ అడవుల్లోకి వెళ్లే అవకా శం ఉంటుంది. అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లే అ వకాశం ఉంటుందని గతంలో ఇక్కడ విధులు నిర్వ హించిన ఫారెస్టు అధికారులు పేర్కొంటున్నారు. కా గా కొంతమంది తమ చేనుల మీదుగా మహారాష్ట్ర లోని అప్పారావ్‌పేట వైపు వెళ్లిందని పేర్కొంటు న్నారు. పులి పూర్తిస్థాయిలో అడవిలోకి వెళ్లే వరకు ప్రజలు జాగ్రత్త వహించాలని ఫారెస్టు అధికారులు సూచిస్తున్నారు. రైతులు తమ పంటచేలకు విద్యుత్ తీగలు అమర్చవద్దని, అలాంటి వారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రంథాలయాలను బలోపేతం చేస్తాం

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్



మాట్లాడుతున్న రియాజ్

ఆదిలాబాద్: గ్రంథాలయాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గ్రం థాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని గురువారం సందర్శిం చారు. నిరుద్యోగ అభ్యర్థులు, పాఠకుల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్ఞాన తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, ఆ దిశగానే గ్రం థాలయాల అభివృద్ధిని ఉద్యమంలా చేపడతామ న్నారు. ఆదిలాబాద్ జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఆదిలాబాద్ రూరల్, మావల, భీంపూర్, సిరికొండ, గాదిగూడ మండలాల్లో నూతన గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రణాళికలు వేస్తున్నామన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సరిపడా టాయిలెట్స్ నిర్మా ణానికి రూ.లక్ష మంజూరు చేస్తున్నట్లు వెల్లడిం చారు. సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో ఉన్న నూతన భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

కైలాస్‌నగర్: పాఠకుల ఆసక్తి, అభిరుచికనుగుణం గా రాష్ట్రంలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తా మని రాష్ట్ర గ్రంథాలయా సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం లైబ్రరీలను ఏనాడూ పట్టించుకోలేద న్నారు. నాయకులు జహీర్ రంజానీ, లోక ప్రవీణ్‌రెడ్డి, సంతోష్, కౌన్సిలర్ సతీష్, యూత్ కాం గ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్ పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడు మృతి



జీవన్‌దాస్ (ఫైల్)

బెజ్జూర్: మండలంలోని సోమి నిలో పాముకాటుతో యువ కుడు మృతి చెందాడు. గ్రామా నికి చెందిన జనగం జీవన్‌దాస్ (21) బుధవారం పత్తి చేనులో పాము కాటేసింది. సాయం త్రం వరకు ఇంటికి రాకపోవ డంతో తల్లిదండ్రులు ఫోన్ చేస్తే పాము కాటేసిం దని చెప్పి స్పృహ కోల్పోయాడు. కుటుంబీకులు అక్కడికి చేరుకుని నాటు వైద్యం చేయించారు. తర్వాత మహారాష్ట్రలోని అహిరి ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

బైక్‌పై నుంచి పడి ఒకరు..

జన్నారం: బైక్‌పై నుంచి పడి ఒకరు మృతిచెందా రు. జన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది.ఎస్సై రాజవర్ధన్ కథనం ప్రకారం .. మండలంలోని చెరుకుగూడెంకు చెందిన కట్లకుం ట రాజ న్న (45), ముల్కల రవిలు గురువారం బైక్‌పై దండేపల్లి మండలం పెద్దయ్యదేవునిగుట్ట వద్దకు మొ క్కు తీర్చుకోవడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పైడిపల్లి సమీపంలో అతివేగంగా వ స్తున్న బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమా దంలో రాజ న్న అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన రవిని 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిం చారు. ఈమే రకు కేసు దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కూలి డబ్బుల కోసం గొడవ

- ఒకరి మృతి

నేరడిగొండ: కూలి డబ్బుల కోసం ఇద్దరి మధ్య జరిగిన గొడవలో ఒకరు మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గుం డెటి శేఖర్ (34) గత కొంత కాలంగా బత్తుల వెంక టేశ్(మేస్త్రీ) వద్ద కూలీ పనిచేసేవాడు. గత రెండు వారాలుగా కూలి డబ్బులు ఇవ్వడం లేదు. గురువా రం ఉదయం రాజస్తాన్ హోటల్ వద్ద ఉన్న వెంకటే శ్‌ను డబ్బులు ఇవ్వాలని అడుగగా, ఇచ్చేది లేదన డంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వె ంకటేశ్ శేఖర్‌ను నెట్టి వేయడంతో కిందపడి తలకు తీవ్ర గాయమైంది. బోథ్ ఆస్పత్రికి తరలించగా అ ప్పటికే మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సర్టిఫికెట్లు ఇప్పించండి

- హైకోర్టును ఆశ్రయించిన ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థి



హైకోర్టు పరిసరాల్లో పూర్వ విద్యార్థి ఫణికుమార్

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ పూర్వ విద్యార్థి సామల ఫణికుమార్ తన సర్టిఫికెట్లు ఇప్పించాలని హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం ఫీజు రీయిం బర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో క్యాంపస్ అధికారులు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదని ఈనెల 22న హైకోర్టును ఆశ్రయించాడు. సర్టిఫికెట్లు లేక తాను ఉద్యోగరీత్యా విదేశాల్లో పనిచేసేందుకు వెళ్లలేకపో తున్నానని పిటిషన్‌లో పేర్కొన్నాడు. గురువారం కోర్టు పిటిషన్‌పై విచారణ జరిపింది. నల్గొండ జిల్లా గట్టుపల్లి మండలం పేరడిపెల్లి గ్రామానికి చెందిన ఫణికుమార్ 2017లో ట్రిపుల్‌ఐటీలో చేరాడు. 2023 వరకు ఇంజినీరింగ్ పూర్తిచేశాడని, సెమ్ టాపర్‌గా డైరెక్టర్ అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు కూడా అందుకున్నాడని పిటిషనర్ తరపు న్యాయ వాది కోర్టుకు తెలిపారు. రూ.86 వేల ఫీజు బకాయి లు ప్రభుత్వం మంజూరు చేసినా ఆ నిధులు ఇంకా క్యాంపస్‌కు జమకాలేదని తెలిపారు. దీంతో ఒరిజినల్ డిగ్రీ, టీసీ, స్టడీ కండక్ట్ సర్టిఫికెట్లు ఇవ్వలే దని వివరించారు. ఎంతో మంది విద్యార్థుల పరిస్థితి ఇలాగే ఉందని కోర్టుకు తెలిపారు. చాలా మంది సొంతంగా డబ్బులు చెల్లించి సర్టిఫికెట్ల తీసు కెళ్లారని పేర్కొన్నారు. దీంతో న్యాయమూర్తి రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సంప్రదించాలని న్యాయస్థానం పిటిషనర్‌కు సూచించింది. ట్రిపుల్ ఐటీకి కూడా నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ ఒక ప్రకటన విడుదలచేశారు. బాసర పూర్వ విద్యా ర్థి హైకోర్టులో కేసు ఫైల్‌చేసిన నేపథ్యంలో న్యాయ స్థానం సూచనలుపాటిస్తూ విశ్వవిద్యాలయ నియ మనిబంధనలు అనుసరిస్తూ నిర్ణయం తీసుకుం టామని పేర్కొన్నారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ



ప్రశంసపత్రాలు అందిస్తున్న సామ్రాట్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల 108 అంబులెన్సు పైలట్లు, ఈఎంటీలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై గురువారం శిక్షణ అందించారు. అంబులెన్సు వాహనాల అధికారులు గజేందర్, లింగాచారి నూతనంగా అం బులెన్సులకు అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందిస్తూ, రోగులకు మెరుగైన వైద్య సేవలం దించేందుకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఉత్తమ పైలట్లకు ప్రశంసపత్రాలు

మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట, దండేపల్లి మం డలంలో 108 అంబులెన్సులో పైలట్లుగా గంగన్న, గోపి ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు సంపత్, సతీశ్, ఈఎంటీలు, పైలట్లు పాల్గొన్నారు.



● పుప్పొడి నేత

పరాగ మంజరి

పూల అందాలను చూసి మైమరచిపోవడం మనకు తెలిసిందే! వాటిలో దాగున్న పరాగ రేణువుల అందం చూస్తే... ప్రకృతి ఒడిలో మనకు తెలియని ఇన్ని అద్భుతాలు దాగున్నాయా అని ఆశ్చర్యపోవాల్సిందే! అత్యంత సంక్లిష్టంగా ఉండే ఆ పరాగ రేణువుల నిర్మాణపు అందాన్ని చూడటమే కాదు, వాటిని టెక్స్‌టైల్ డిజైన్స్‌లో తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నది హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఎమ్మెస్సీ విద్యార్థిని శివాని నేత చిలుకూరి. అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ అద్భుతాలను 'పరాగ మంజరి'గా మనకు పరిచయం చేస్తున్నది. 'దేశానికి గుర్తింపు తెచ్చే లక్షలాది యునిక్ డిజైన్స్‌ని పరిచయం చేయబోతున్న ఆనందంలో ఉన్నాను' అంటున్న శివాని నేత తన ప్రాజెక్ట్ విశేషాలను ఇలా మన ముందుంచింది..

''పరాగ అంటే పుప్పొడి – మంజరి అంటే డిజైన్. సంస్కృతం నుంచి తీసుకున్న ఈ పదాలను మా ప్రాజెక్ట్‌కు పెట్టాం. బీఎస్సీ అగ్రికల్చర్ చేయాలనుకుని, కుదరక బోటనీ సబ్జెక్ట్ తీసుకున్నాను. ఉస్మానియా యూనివర్శిటీలో ఎమ్మెస్సీ బోటనీ చేస్తున్నాను. నాకు డ్రాయింగ్ కూడా తెలుసు అని మా బోటనీ ప్రొఫెసర్ విజయ భాస్కర్ రెడ్డి సర్ నాకు ఈ డిజైనింగ్ టాపిక్ ఇచ్చారు. దానిని ఇలా మీ ముందుకు తీసుకు రాగలిగాను.

లక్షలాది మోడల్స్

పరాగ రేణువులను రెండు విధాలుగా మైక్రోస్కోప్ చేశాను. లైట్ మైక్రోస్కోపీలో ఫ్లవర్ స్ట్రక్చర్, సెమ్(స్కానింగ్ ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్)లో పుప్పొడి రేణువులను స్కాన్ చేశాను. భూమిపైన లక్షలాది మొక్కలు, వాటి పువ్వులు వేటికవి భిన్నంగా ఉంటాయి. ఇక వాటిలోని పరాగ రేణువులు మరింత భిన్నంగా ఉంటాయి. మందార, వేప, తులసి, తిప్పతీగ, తుమ్మ, అర్జున, ఉల్లి పాయ, కాకర, ఆరెంజ్, జొన్న, మొక్క జొన్న, ఖర్జూరం, దోస పువ్వు... ఇలా దాదాపు 70 రకాల పుప్పొడి రేణువులను స్కాన్ చేసి, ఆ స్కెలిటిన్ నుంచి మోటిఫ్స్‌ను వెలుగులోకి తీసుకువచ్చాను. ఈ అందమైన పరాగ రేణువుల నుంచి మోటిఫ్స్ డిజైన్స్‌గా తీసుకు రావడానికి నాలుగు నెలల సమయం పట్టింది.

పేటెంట్ హక్కు

ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్‌లోనే టెక్స్‌టైల్ ప్యాటర్న్‌ని తీసుకున్నాను. క్లాత్ మీదకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాను. మాది నేత కుటుంబమే. నేను చేసిన ఈ ప్రింట్స్ క్లాత్స్ మీదకు తీసుకురావచ్చని నిర్ధారణ చేసుకున్నాం. కాటన్, పట్టు, సీకో మెటీరియల్ మీదకు మోటిఫ్స్ ప్రింట్స్ చేయచ్చు. నేతలోనూ డిజైన్స్ తీసుకోవచ్చు. ఎంబ్రాయిడరీ కూడా చేయచ్చు. మేం ముందు టీ షర్ట్ పైన ప్రింటింగ్



శివాని నేత

ప్రయత్నం చేశాం. ఇంకా మిగతా వాటి మీదకు ప్రింట్స్ చేయాలంటే టెక్స్‌టైల్ ఇండస్ట్రీ మద్దతు అవసరం అవుతుంది. బ్లాక్ ప్రింట్ చేయాలన్నా .. అందుకు తగిన వనరులన్నీ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ముందుగా పేటెంట్ హక్కు పొందేవరకు వెళ్లింది. దీనిని ఒక స్టార్టప్‌గా త్వరలో ప్రారంభించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

టెక్స్‌టైల్ రంగం మద్దతుతో...

ప్రకృతిలో కళ్లకు కనిపించేవి లైట్ మైక్రోస్కోపిక్ ద్వారా నలభై వరకు పిక్చర్స్ తీసుకుంటే, స్టెమ్ ద్వారా మరికొన్ని సాధించాం. కంప్యూటర్‌లో వియానా దేశం నుంచి పోలెన్ గ్రెయిన్స్ స్కెలిటన్ స్ట్రక్చర్ నుంచి కొన్ని తీసుకున్నాం. మన దేశానికి వేల సంవత్సరాల నుంచి అద్భుతమైన టెక్స్‌టైల్ డిజైనింగ్ కల్చర్ ఉంది. కలంకారీ, ఇకత్ పోచం పల్లి, గొల్ల భామ, రాజస్థాన్‌లో బాందినీ, గుజరాతీలో లెహెరియా, కాశ్మీర్ ఎంబ్రాయిడరీ ఎప్పటి నుంచో ఉన్నాయి. అలాగే 'పరాగ మంజరి' మన దేశానికే వన్నె తెచ్చేలా తీసుకురావాలన్నది నా ప్రయత్నం. దీనిని తెలంగాణ ప్రభుత్వం టెక్స్‌టైల్ శాఖకు అందించి, వారి సపోర్ట్ తీసుకొని, ఈ వర్క్‌ను వెలుగులోకి తీసుకురావాలనుకుంటున్నాం'' అని శివాని నేత చిలుకూరి తెలియజేశారు.

– నిర్మలారెడ్డి,
'సాక్షి' ఫీచర్స్ ప్రతినిధి

లక్ష ప్యాటర్న్స్

ఒక్కో చెట్టు పువ్వుకు ఒక్కో ప్రత్యేకమైన పరాగ రేణువులు ఉంటాయి. ఈ పరాగ రేణువుల మోడల్స్ నుంచి కొన్ని లక్షల ప్యాటర్న్స్ టెక్స్‌టైల్ రంగంలోకి తీసుకురావచ్చు. వీటిని పట్టు, కాటన్, సిల్క్, బెడ్ షీట్స్.. ఇలా ప్రతి క్లాత్ మీదకు తీసుకురావచ్చు. ఈ ప్రాజెక్ట్ తయారు చేస్తున్నప్పుడు ప్రపంచంలో ఎవరైనా ఇలా చేశారా.. అని శోధించాను. కానీ, ఎక్కడా మాకు ఆ సమాచారం లభించలేదు. అందుకే, పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశాం. ఈ ప్యాటర్న్స్ వస్త్ర డిజైన్ పరిశ్రమల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి.



– డాక్టర్ అల్లం విజయ భాస్కర్‌రెడ్డి,
అసోసియేట్ ప్రొఫెసర్,
బోటనీ డిపార్ట్‌మెంట్, ఉస్మానియా యూనివర్శిటీ

స్త్రీ శక్తి



మన్నిదా బాను

ప్రాణం నిలిపి

మన్నిదా బాను మంగుళూరులోని కద్రి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. ఈమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరారు. అక్టోబర్ 23 తెల్లవారు జామున 3.40 కి ఆ స్టేషన్ కి కాల్ వచ్చింది. అక్కడికి దగ్గర్లోని పాలిటెక్నిక్ కాలేజి సెంటర్లో పెద్ద ఆక్సిడెంట్ అయింది. పికప్ వెహికల్, కంటైనర్ ట్రక్కు డీ కొట్టుకున్నాయి. ఇదీ ఆ కాల్. వెంటనే మన్నిదా తన స్కూటీ పై ప్రమాద ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె వెళ్లేటప్పటికి ఆ వాహనాలు తుక్కు తుక్కు అయి ఉన్నాయి. ఒక వ్యక్తి రక్తపు మడుగులో చావు బతుకుల మధ్య కొట్టుకుంటున్నాడు. ఆ రెండు వాహనాలలో ఒకదాని క్లీనర్ అతను. మన్నిదా అతడి పరిస్థితిని గమనించారు. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని అతి కష్టమ్మీద లేపి, తన స్కూటర్ పై నేరుగా ఆ దగ్గర్లోని ప్రైవేట్ ఆసుపత్రికి మోసుకెళ్లారు. అతడి ప్రాణాలని నిలబెట్టగలిగారు.

ఆమె టైమ్ సెన్స్, ఆమె వేగం, ఆమె ధైర్యం, ఆమెలోని కారుణ్యం, ఆమె యూనిఫామ్.. అన్నీ పంచభూతాల్లా ఒకటై ఆ వ్యక్తి ప్రాణాలను కాపాడాయనే అనుకోవాలి. అదే కనుక.. పోలీస్ కాకుండా ఒక మామూలు వ్యక్తి ఎవరైనా అంతలా గాయపడిన వారిని తీసుకెళితే ప్రైవేటు హాస్పిటల్స్ చేర్చుకుని ఉండేవా?! 'మేం అడ్మిట్ చేసుకోడానికి లేదు. ఇది పోలీస్ కేస్..' అని ఉండేవి.

'వాయు వేగంగా స్పందించి ఒకరి ప్రాణాన్ని నిలబెట్టిన కద్రి స్టేషన్ మహిళా పోలీస్ కానిస్టేబుల్ మన్నిదా బానుకు' అభినందనలు అంటూ తెల్లారగానే మంగుళూరు సిటీ పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ ట్వీట్ పెట్టారు. మంగుళూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మన్నిదాకు ప్రశంసలు అందాయి.

డ్యూటీ మైండెడ్ మాత్రమే అయి ఉంటే ఘటనా స్థలానికి వెళ్లగానే ఫార్మాలిటీస్ లో పడి ఉండేవారు మన్నిదా. కానీ ఆమె అలా చేయలేకపోయారు. ఆమెలోని మానవతా హృదయం.. ఉద్యోగ విధి విధానాలను దాటి మరీ స్పందించింది. అందుకు 'తగిన శిక్ష' ఏదైనా ఉందంటే.. అది ప్రమోషనో, ప్రశంసాపత్రమో తప్ప మరొకటి అవుతుందా?! మన్నిదా మాత్రం.. 'నేను చేసింది ఏముందీ..!' అని చిరునవ్వుతో అంటున్నారు.. తనపై కురుస్తున్న అభినందనల జల్లులలో తడిసి ముద్ద అవుతూ.



రీనా వర్గీస్

ప్రాణాలకు తెగించి

సాహసాన్ని వెన్నెముకగా ధరించే వాళ్లకు అసాధ్యం ఉండదు. హై–రిస్క్ అనేది ఉండదు.

ఈ విషయాన్ని మరోసారి అక్షరాలా నిరూపించింది పైలట్ రీనా వర్గీస్. అడవిలో, అత్యంత ప్రతికూల పరిస్థితులలో ప్రాణాపాయంలో ఉన్న జవాన్‌ను ఆస్పత్రికి తరలించింది.

రీనా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన కొత్తలో... 2009లో సీనియర్ పోలీసు అధికారులను తీసుకు వెళుతున్న హెలికాప్టర్‌ను మావోయిస్ట్‌లు కూల్చివేశారు. తాను చేస్తున్న ఉద్యోగం ఎంత రిస్క్ అనేది అర్థం చేసుకోవడానికి ఆ సంఘటన రీనాకు ఉపయోగపడింది.

తాజా విషయానికి వస్తే...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కమాండోలు, మావోయిస్ట్‌లకు మధ్య ఎనిమిది గంటల పాటు జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో ఒక కమాండో తీవ్రంగా గాయపడ్డాడు. మావోయిస్ట్‌ల రాకెట్ దాడులకు అవకాశం ఉన్న ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో గాయపడిన కమాండోను అక్కడి నుంచి తరలించడం అంటే ప్రాణాలను పణంగా పెట్టడమే.

ఉన్నతాధికారుల నుంచి సమాచారాన్ని అందుకున్న రీనా వర్గీస్ తన ప్రాణాన్ని లెక్క చేయకుండా హన్స్ హెలికాప్టర్‌తో రంగంలోకి దిగింది. కో–పైలట్‌కు కమాండ్స్ అందజేసి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో హెలికాప్టర్‌ను వీలైనంత వరకు దించి కిందికి దూకింది.

తాడు సహాయంతో గాయపడిన కమాండోను హెలికాప్టర్‌లోకి తీసుకువచ్చింది. 30 నిమిషాలలో గడ్చిరోలికి అక్కడి నుండి నాగ్‌పూర్ తరలించింది. మూడు బుల్లెట్లు తగిలిన కమాండోకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో బి.టెక్ చేసిన రీనా వర్గీస్ గతంలో ఎన్నో ముఖ్యమైన రెస్క్యూ ఆపరేషన్‌లలో పాల్గొంది. కోవిడ్ మహమ్మారి సమయంలో బాధితులను లక్షద్వీప్ నుంచి కొచ్చికి తరలించే రెస్క్యూ ఆపరేషన్‌లలో చురుగ్గా పాల్గొని ప్రశంసలు అందుకుంది.

తాళపత్ర కళ



బాల త్రిపుర సుందరి







అవసరం ఒక ఆవిష్కరణకు దారి వేసింది. ఆర్థిక అవసరాలే తనను హ్యాండీక్రాఫ్ట్ కళాకారిణిగా తీర్చిదిద్దాయని చెప్పారు బాల త్రిపుర సుందరి. తాటి ఆకులతో గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు తయారు చేస్తారామె. వీటి తయారీలో మహిళలకు శిక్షణనిస్తారు కూడా. తాటి ఆకు కళారూపాల తయారీలో యాభై ఏళ్ల అనుభవం ఆమెది.

ఒక నిర్ణయం జీవితాన్ని మార్చేసింది!

త్రిపుర సుందరికి 75వ సంవత్సరం. ఆమెది తూర్పుగోదావరి జిల్లాలో ఓ కుగ్రామం. చదువుకు నోచుకోని త్రిపుర సుందరి 1972లో ముంబయికి వెళ్లి హస్తకళాకృతుల తయారీలో సర్టిఫికేట్ కోర్సు చేశారు. అక్కడ నేర్పించిన కళారూపాలతోపాటు తన క్రియేటివిటీతో మరి కొన్ని రూపాలను తయారు చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో హస్తకళాకృతుల ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టారు. ప్రస్తుతం హైదరాబాద్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలో పామ్ క్రాఫ్ట్ కళాకృతులను ప్రదర్శిస్తున్నారు.

పనిలోనే ఆనందం

''మా ఊరిలో తెలిసిన వాళ్ల ద్వారా ముంబయిలో శిక్షణ కోర్సు గురించి తెలిసింది.. మూడు నెలల కోర్సు, బస భోజన వసతులు వాళ్లే ఏర్పాటు చేస్తారని చెప్పారు. చదువు లేదు, భాష ఇబ్బందవుతుందేమోనని భయంతోనే వెళ్లాను. కానీ అక్కడ తెలుగు వాళ్లు కూడా ఉండడంతో ఇబ్బంది కలగలేదు. క్రమంగా హిందీలో చెప్తున్న విషయాలు అర్థం కాసాగాయి. కోర్సు పూర్తయిన తర్వాత మా ఊరికి వచ్చి, నిడదవోలులో ఉన్న తాటిబెల్లం ఫెడరేషన్ లో ట్రైనర్‌గా ఉద్యోగంలో చేరాను. బదలీ మీద 1983లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కి వచ్చాను. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్‌తో కూడా పని చేశాను. ఆ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత ఇప్పుడు కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డులో మా ఇంటి దగ్గర నాకు నచ్చిన కళారూపాలు అల్లుకుంటూ, ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెడుతున్నాను. వీటితోపాటు తుక్కుగూడలోని నీరా యూనిట్‌లో శిక్షణనిస్తున్నాను. బంధువులు, స్నేహితులు ఇంకా పని చేయడం ఎందుకని అడుగుతుంటారు. పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయి, నేను పని చేయకపోతే అడిగేవాళ్లు కూడా లేరు. కానీ నాకు పని చేయకుండా కూర్చుని తినడం ఇష్టం ఉండదు. ఆరోగ్యం బాగున్నప్పుడు పని మానేయడం ఎందుకు?'' అంటూ స్టాల్‌లో ఆమె బొమ్మల ధరలు అడుగుతున్న వారికి బదులివ్వడంలో మునిగి పోయారామె.

– వీఎమ్‌ఆర్
ఫోటోలు: ఎస్ఎస్ ఠాకూర్

హెల్దీ డైట్

సూజీ బ్రెడ్



కావలసినవి: బొంబాయి రవ్వ – ఒకటిన్నర కప్పులు; ఇన్‌స్టంట్ ఈస్ట్ – టీ స్పూన్; చక్కెర పొడి– టేబుల్ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్; పాలు – 3 టేబుల్ స్పూన్‌లు; నీరు – అర కప్పు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; వెన్న – టీ స్పూన్; సీడ్స్ – 3 టేబుల్ స్పూన్‌లు (బాదం పలుకులు, పిస్తా, గుమ్మడి గింజలు, డ్రైఫ్రూట్ చిప్స్ వంటివి).

తయారీ

- రవ్వను మిక్సీజార్‌లో మెత్తగా పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో ఈస్ట్, చక్కెర పొడి, ఉప్పు వేసి కలపాలి.
- అందులో నీరు, పాలు, నూనె వేసి బీటర్‌తో బాగా కలిపి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి.
- అడుగు చదరంగా ఉన్న పాత్రకు వెన్న రాసి అందులో పై మిశ్రమాన్ని వేసి చపాతీల పిండిని కలిపినట్లు చేత్తో 15 నిమిషాల సేపు మర్దన చేయాలి. కొద్దిగా పిండిని తీసుకుని వేళ్లతో సాగదీస్తే పలచబడుతూ సాగాలి. అలా వచ్చే వరకు మర్దన చేసి వేరొక పెద్ద పాత్రకు వెన్న రాసి అందులో పెట్టి మూత పెట్టాలి. ఆ పాత్రను గంట సేపు వెచ్చని ప్రదేశంలో ఉంచాలి, పిండి రెండింతలవుతుంది.
- ఏడంగుళాలు, నాలుగు అంగుళాల కొలతల లోఫ్ పాన్‌కు వెన్న రాసి అందులో బ్రెడ్ పిండిని పెట్టి అర గంట సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ కొలతలతో చేసిన పిండి పాన్‌లో సగానికి మాత్రమే వస్తుంది. అరగంట సేపటికి పిండి పరిమాణం రెండింతలవుతుంది. ఆ మిశ్రమం లోఫ్ పాన్‌లో పూర్తిగా అమరే లోపు పిండి మీద పాలను అద్ది ఆ పైన బాదం ఇతర గింజలను చల్లాలి.
- ఈ లోపు ప్రెషర్ కుకర్‌ను వేడి చేయాలి. లోఫ్ పాన్‌ను కుకర్‌లో అమర్చిన తర్వాత మూతపెట్టి 25 నిమిషాల సేపు చిన్న మంట మీద ఉంచాలి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఒంటె బుక్ చేయాలి ఓటిపి నంబర్ ఎంత?

ఊబర్, ఓలాలో ఆటోనో స్కూటరో కారో బుక్ చేయొచ్చు. వస్తుంది. కాని ఒంటెను బుక్ చేయొచ్చా? దుబాయ్‌లో ఇద్దరు ఆడవాళ్లు ఎడారిలో తప్పిపోయారు. ఊబర్‌లో వెతికి ఒంటెను బుక్ చేశారు. ఒంటె ఐదు నిమిషాల్లో వచ్చింది. ఎక్కారు. ఇంటర్‌నెట్‌లో సరదా దుమారం రేపుతున్న ఈ కథనం వెనుక యదార్థం ఏమిటి?



పల్లెటూరులో ఉన్నప్పుడు ఎడ్లబండి, నది ఒడ్డున పడవ, అడవిలో ఏనుగు, కొండ దారిలో గాడిద, ఎడారిలో ఒంటె ఇలా ఊబర్ ద్వారానో ఓలా ద్వారానో బుక్ చేసే వీలుంటే ఎంత బాగుంటుంది? ఏమో ఆ రోజులు కూడా వస్తాయేమో. రెండు రోజుల క్రితం అలాంటి విషయాన్నే చూపి లోకాన్నంతా ఆకట్టుకుంది ఒక వీడియో. దుబాయ్‌లో ఇద్దరు మహిళలు 'మేము ఎడారిలో తప్పిపోయాం. ఊబర్‌లో ఒంటె ఉందేమో చూద్దాం' అని ఫోన్‌ని స్క్రోల్ చేస్తే ఒంటెను బుక్ చేసే ఆప్షన్ ఊబర్‌లో కనిపించింది. వారిలోని ఒక మహిళ ఒంటెను బుక్ చేయగానే దీపక్ అనే వ్యక్తి ఐదు నిమిషాల్లో ఒంటెతో ప్రత్యక్షమయ్యాడు. ఇంకేముంది... ఆ మహిళల ఆనందానికి హద్దే లేదు. వారిలో ఒకామె ఒంటెనెక్కి 'ఇది భలే ఉంది' అనుకుంటూ ఇంటిదారి పట్టింది. ఈ వీడియో ఇంటర్‌నెట్‌లో రాగానే లక్ష లైకులు సంపాదించుకుంది. సరదా వ్యాఖ్యల్ని కూడా. 'ఓటీపీ నంబర్ ఎంత?', 'దుబాయ్‌లో అంతే', 'నంబర్ ప్లేట్ ఎక్కడ'... ఇలా. నిజానికి ఇది నిజంగా జరగలేదు. 'జెట్‌సెట్ దుబాయ్' అనే ట్రావెల్ సంస్థ ఊబర్‌తో కలిసి చేసిన ప్రమోషనల్ వీడియో. దుబాయ్‌లో అయినా సరే ఊబర్ ఒంటె సర్వీస్‌ను ఇవ్వదు. కాని 'ఏటీవీ' (ఆల్ టెర్రయిన్ వెహికిల్)ను బుక్ చేసుకోవచ్చు. దుబాయ్‌లో ఊబర్ బ్లాక్ (హైఎండ్ కార్లు), గ్రీన్ (ఎలక్ట్రిక్ కార్లు), ఎల్‌యుఎక్స్ (లగ్జరీ కార్లు) రైడ్‌కు పంపుతుంది. మొత్తం మీద ఈ యాడ్ కొత్త ఆలోచనలు రేకెత్తించింది. కార్లు, బైక్‌లు, ఆటోలకు ఉన్న ఇలాంటి సర్వీసులు ఇకపై ప్రాంతాన్ని బట్టి మారితే బాగుండనిపించింది.

బ్యూటిప్స్

మెరిసే మేని ఛాయను కాపాడుకోవాలంటే..



- తక్షణ తాజాదనం కోసం రోజ్ వాటర్ లేదా దోసకాయ రసంతో మేనికి మర్దనా చేసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- పచ్చి పాలను కాటన్ బాల్‌తో అద్దుకొని, ముఖానికి రాయాలి. 10 నిమిషాల పాటు అలాగే ఉంచి కడిగేయాలి. పాలలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మాన్ని సున్నితంగా ఉంచడంతో పాటు శుభ్రపరుస్తుంది.
- చర్మంపై నుంచి సహజ నూనెలను పోకుండా ఉండటానికి చర్మతత్వానికి సరిపోయే తేలికపాటి, క్లెన్సర్‌ని ఉపయోగించాలి.
- ఓట్‌మీల్‌లో తేనె, కొద్దిగా నీళ్లతో కలిపి పేస్ట్ చేయాలి. మృత చర్మ కణాలను తొలగించడానికి, పోర్స్‌ను శుభ్రం చేయడానికి సున్నితంగా స్క్రబ్ చేయాలి.
- ప్రతిరోజూ కలబంద జెల్‌ను రాసి, మృదువుగా మర్దనా చేయాలి. దీని వల్ల చర్మం నునుపుగా, తేమగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ తేనెను, టేబుల్ స్పూన్ పెరుగుతో కలపాలి. దీన్ని ముఖానికి అప్లై చేసి, 15 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ చర్మాన్ని కాంతిమంతం చేస్తుంది.
- సగం అరటిపండును మెత్తగా చేసి, టీస్పూన్ తేనెతో కలపాలి. చర్మం మృదువుగా, మెరుస్తూ ఉంటుంది.
- కొద్దిగా గ్రీన్ టీని కాచి, చల్లబరచాలి. ఈ నీటిని దూదితో అద్దుకుంటూ, మేనికి పట్టించాలి. ఎండకు కమిలిన చర్మం తాజాగా మారుతుంది.